క్లుప్తంగా

ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచుకోండి

ఎంపీడీఓ విశ్వప్రసాద్



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

కంది(సంగారెడ్డి): ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచుకోవాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ సూచించారు. శుక్రవారం కంది మండలంలోని బేగంపేట, చిద్రుప్ప గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు అవసరమైతే కూలీల సంఖ్యను పెంచుకోవాలన్నారు. అలాగే ఉపాధిహామీ పనుల్లో చేపట్టాల్సినవి గుర్తించి ప్రణాళికలను ఫీల్డ్ అసిస్టెంట్లు తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



జోగిపేట(అందోల్): రథం ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): అందోల్‌లోని శ్రీ భూనీల సమేత శ్రీ రంగనాథ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి వరకు రథోత్సవం కనుల పండవగా జరిగింది. ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై దేవాతా మూర్తుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ప్రదీప్‌గౌడ్, అందోల్ కౌన్సిలర్లు హరికృష్ణగౌడ్, ఆలయ కమిటీకి చెందిన రామకృష్ణ మల్లేశం, నాగరత్నంగౌడ్, అరుణ్, ఆలయ అర్చకులు శ్యాంనాథ శర్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన



ఎమ్మెల్యే దంపతులను సన్మానించిన మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి దంపతులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ గ్రామంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి శ్రీ దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనను వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, సతిమణి యాదమ్మ పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డితో కలిసి అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజ, బీఆర్ఎస్ నేత ఆదర్శ్ రెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఊట్ల గ్రామంలో చేపట్టిన అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠలో శుక్రవారం చిట్కుల్ సర్పంచ్ నీలం మధు పాల్గొన్నారు. దేవాలయ నిర్మాణానికి తనవంతు సాయం అందించానని అన్నారు. అనంతరం నీలం మధును దేవాలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

దేవాలయాలతో ఆధ్యాత్మిక శోభ



విరాళం అందజేస్తున్న భిక్షపతి

జోగిపేట(అందోల్): దేవాలయాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మఠం భిక్షపతి అన్నారు. శుక్రవారం పుల్కల్ మండలం పెద్ద రెడ్డిపేట గ్రామంలో రామమందిర నిర్మాణానికి ఆయన రూ. 2లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ భక్తి భావంతో పాటు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. ఈ విరాళాన్ని గ్రామ సర్పంచ్ సతీశ్‌కు అందచేశారు.

సీఎం కప్ క్రీడలకు సర్వం సిద్ధం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పుల్‌కల్‌లో క్రీడల నిర్వహణపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కప్ క్రీడలకు సర్వం సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెల15 నుంచి నిర్వహించ తలపెట్టిన సీఎం కప్ క్రీడలను ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలో క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సీఎం కప్ పోటీలపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల మధ్య గల వారందరూ క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ అంశాల్లో క్రీడలు నిర్వహిస్తారన్నారు.

క్రీడాప్రాంగణాలు

జిన్నారం మండల స్థాయి క్రీడా పోటీలు ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల క్రీడామైదానంలో, రామచంద్రపురం బీహెచ్ఇఎల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, పటాన్‌చెరు మైత్రి క్రీడా మైదానం, గుమ్మడిదల జిల్లా పరిషత్ హై స్కూల్, అమీన్‌పూర్ కృష్ణవేణి హై స్కూల్ గ్రౌండ్స్, పటేల్ గూడా గ్రామాలలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, దశరథ్ రెడ్డి పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్‌లో

జహీరాబాద్ టౌన్: సీఎం కప్‌ను విజయవంతం చేయాలని కమిటీ చైర్మన్ ఎంపీపీ గిరిధర్‌రెడ్డి కోరారు. ఈ సవేశంలో ఎంపీడీఓ సుమతి మాట్లాడారు. ప్రత్యేక అధికారి వసంత కుమారి, ఎంపీఓ మహేశ్వర్, ఎఈఓ, బస్వరాజ్, పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్‌లో

సంగారెడ్డి టౌన్: 15 నుంచి సంగారెడ్డి మండలంలో సీఎం కప్పు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రవీందర్ శుక్రవారం తెలిపారు. మండలంలోని యువకులు క్రీడా పోటీలలో పాల్గొనాలని తెలిపారు.

హత్నూరలో

హత్నూర(సంగారెడ్డి): సీఎం కప్‌ను పటిష్టంగా నిర్వహించాలని డిప్యూటీ సీఈవో స్వప్న తెలిపారు. హత్నూర మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పీఈటీలు, ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శారదా దేవి ఆయా గ్రామాల కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పుల్‌కల్(అందోల్): సీఎం కప్‌ను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి వామన్ రావు తెలిపారు. ఎంపీపీ సమావేశమందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో క్రీడల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆసక్తిగలవారు ఈ నెల 14తేదీ వరకూ ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి వామన్ రావు తెలిపారు.

మునిపల్లి(అందోల్): మండల స్థాయి అధికారులతో ఎంపీపీ శైలజా శివశంకర్ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీఓ అంజలి దేవి అధ్యక్షతన సీఎం కప్పుపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శివకుమార్, బుదేరా ఎస్ఐ రాజేశ్వర్, ఎంఈఓ దశరథ్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మన్సూర్ పాల్గొన్నారు.



జహీరాబాద్ టౌన్: మాట్లాడుతున్న ఎంపీపీ గిరిధర్‌రెడ్డి



మునిపల్లి(అందోల్): ఎంపీపీ కార్యాలయంలో సమావేశం

నిరుద్యోగుల పక్షాన బీజేపీ పోరాటం ఆగదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్



నారాయణఖేడ్: మాట్లాడుతున్న జన్‌వాడే సంగప్ప

అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప

నారాయణఖేడ్: నిరుద్యోగుల పక్షాన బీజేపీ పోరాటం ఆగదని రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ జిల్లా కేంద్రంలో చేపట్టిన నిరుద్యోగ మార్చ్ వేడి కేసీఆర్ ఫాంహౌస్‌కు తగలడంతో బీఆర్ఎస్ నాయకులు బండిసంజయ్‌పై అవాకులూ, చవాకులూ పేల్చుతున్నారని జన్‌వాడే సంగప్ప మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డితో కలిసి నారాయణఖేడ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తన స్థాయిని మరచి కేసీఆర్‌కు బానిసలా వ్యవహరించడమే కాకుండా, తన నోటిదురుసును ప్రదర్శిస్తున్నారన్నారు. బిశ్వంత్ కమిషన్ రాష్ట్రంలో 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని చెప్పిందని గుర్తుచేశారు. కానీ1.35లక్షల ఉద్యోగాలు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకోవడం బాధాకరమన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు లేకుండా చేస్తామని చెప్పి, నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఉద్యోగ భద్రత కల్పించాలంటూ దీక్షలకు దిగుతున్నారని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కారణంగా 30లక్షల మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. అభ్యర్థులకు లక్ష రూపాయల చొప్పున పరిహారం అందించాలని పేర్కొన్నారు. జేపీఎస్‌లను పర్మినెంట్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుండడంతో వరంగల్‌జిల్లాలో బైరి సోని ఆత్మహత్య చేసుకుందన్నారు. నిరుద్యోగులు, యువతను మోసం చేస్తున్న బీఆర్ఎస్ చర్యలను ఎండగడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తన పోరాటాన్ని ఇంకా ఉధృతం చేస్తాడని సంగప్ప బీఆర్ఎస్‌ను ఉద్దేశించి హెచ్చరించారు. ఈ సమావేశంలో నారాయణఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ రజినీకాంత్, మారుతిరెడ్డి, సీనియర్ నాయకులు సాయిరా, రాజుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, సుధాకర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్(సంగారెడ్డి): నిరుద్యోగ మార్చ్ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, దీంతో ఎవరికి ఏం మాట్లాడాలో అర్థం కాక పిచ్చి పిచ్చిగా వాగుతున్నారని మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ వాఖ్యానించారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ స్వప్నం కోసం యువత ఆత్మబలిదానాలు చేసుకున్నారో రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు గడిచినా నేటికీ ఆ కలలు నెరవేరలేదన్నారు. ఎన్నో ఆశలతో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతకు నిరాశే ఎదురవుతుందన్నారు. లక్షలు పెట్టి కోచింగ్‌లు తీసుకున్నారని, తీరా పేపర్ లీకు కావడంతో 30 లక్షల యువత రోడ్డున పడ్డారన్నారు. టీఎస్‌పీఎస్‌సీ బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయడంతో పాటు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరి అంజిరెడ్డి, పోచారం రాములు, మాణిక్ రావు, వాసు, నాగరాజు, సాయికుమార్, ఎల్లయ్య, ప్రశాంత్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఇతర నాయకులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని కాజీపేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం ఘనంగా విగ్రహాన్ని, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, యంత్ర ప్రతిష్ఠ కలాన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు, అమ్మవారి శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం జోగుఎత్తుట, అమ్మవారి ఊరేగింపు ఉంటుంది. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, బీజేపీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, జెడ్పీటీసీ బాబియ నాయక్, సర్పంచ్ హేమలత, సుధాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, యాదగిరి గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



జహీరాబాద్ టౌన్: నిరసన తెలుపుతున్న వీఓఏలు

ఝరాసంగం(జహీరాబాద్): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగం ఐకేపీ కార్యాలయం ఆవరణలో తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ చేపట్టిన సమ్మెను కొనసాగించారు.

జహీరాబాద్ టౌన్‌లో వీఓఏలు

జహీరాబాద్ టౌన్: తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఓఏల సమ్మె కొనసాగుతుంది. యూనియన్ నాయకులు అశోక్ మాట్లాడారు. అన్నపూర్ణ, అనుసూయ, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మినారాయణ, రేణుక, సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ఆత్మీయ సమ్మేళనాలు

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): పార్టీ బలోపేతానికి ఆత్మీయ సమ్మేళనాలు దోహదం చేస్తాయని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కోహీర్ పట్టణ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కోహీర్ పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, పట్టణ అధ్యక్షుడు వహీద్, సుభాష్‌రెడ్డి, ఇజ్రాయెల్ బాబి, జావెద్, కలీమ్, హన్నన్ జావేద్, సంపత్‌కుమార్, గణేష్‌రెడ్డి, అస్లమ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: కల్హేర్ మండలం మహాదేవ్‌పల్లికి చెందిన నారాయణ అనారోగ్యంతో బాధపడుతుండగా అతని కుటుంబీకులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎం ఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధిచిన ఎల్‌ఓసీని శుక్రవారం బాధితుడి కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ పేరుకే గ్రేడ్ వన్ మున్సిపాలిటీ అని అన్నారు. కానీ కార్మికుల సమస్యలు మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు యూనిఫామ్, సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు చీపురు కట్టలు, పారలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో నిరువదిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, యాదయ్య లక్ష్మినారాయణ, నర్సింలు, మహేశ్, గౌతమ్, వెంకట్, సువర్ణ, ఎల్లమ్మ, ప్రమీల, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రంగనాథ ఆలయ ఉత్సవాల్లో ఎమ్మెల్యే క్రాంతికిరణ్



జోగిపేట(అందోల్): రంగనాథ ఆలయంలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్ దంపతులు

జోగిపేట(అందోల్): అందోల్‌లోని శ్రీ భూనీల సమేత రంగనాథ స్వామి దేవాలయ వార్షికోత్సవాల్లో భాగంగా అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ శుక్రవారం పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘనంగా ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీ సుదర్శన లక్ష్మినర్సింహా హోమం, వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు క్రాంతికిరణ్, పద్మలకు శాలువా కప్పి పూలదండలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్యాంనాథశర్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ పి.నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు తోట రామకృష్ణ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్



విద్యార్థులను అభినందిస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఉజ్వల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి, పట్టణ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను చింతా ప్రభాకర్ శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుదలతో చదువుకుని విష్యత్‌లో కూడా రాణించాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించి తల్లి దండ్రుల కలలను సాకారం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో పావని, బైపీసీ ద్వితీయ సంవత్సరంలో టౌన్ ఫస్ట్ ర్యాంకు సర్దార్ అంజుమ్, సీఈసీ ద్వితీయ సంవత్సరం కళాశాల ఫస్ట్ ర్యాంకర్ ఎం భవాని, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం టౌన్ సెకండ్ ర్యాంకర్ బి. నికిత, సీఈసీ ఫస్ట్ ఇయర్ టౌన్ ర్యాంకర్ సుమయ్యబేగంలను చింతా ప్రభాకర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రఘువర్ధన్‌రెడ్డి, కరస్పాండెంట్ పోల వెంకటేశం, డైరక్టర్లు అమరేందర్‌రెడ్డి, అధ్యాపకులు రాజు, శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు చింతా సాయికుమార్, మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, యువత పట్టణ అధ్యక్షుడు బిట్ల ప్రేమ్‌కుమార్, నాయకులు సత్యంగౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమీక్ష సమావేశం

సంగారెడ్డి టౌన్: ఓటర్ జాబితా సవరణకు వివిధ రాజకీయ పార్టీ నాయకులతో శుక్రవారం సంగారెడ్డి మండల కార్యాలయంలో తహసీల్దార్ విజయ్ కుమార్ సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని ఓటర్ జాబితాలలో 18 సంవత్సరాల నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

◆ సత్రం నిర్మాణానికి శంకుస్థాపన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలోని భీరభద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయ ఆవరణలో సుమారు రూ.16లక్షలతో నిర్మించనున్న సత్రానికి దేవాలయ అధికారులు, దాత శుక్రవారం శంకుస్థాపన చేశారు. దివంగత పగిడి నర్సింహ్మారెడ్డి, పెద్దరాములమ్మల జ్ఞాపకార్థం గాజుల రామారానికి చెందిన పగిడి అంజిరెడ్డి సత్రాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది సోమయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎస్ఐని విధుల్లోకి తీసుకోవాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ: సస్పెండ్ అయిన ఎస్ఐ అనిల్‌ను బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని బీసీ యువజన సంఘం పుల్కల్ మండల అధ్యక్షుడు రవీందర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఇద్దరు మహిళల మధ్య గొడవ జరిగింది. బస్సులో కూర్చోవడానికి సీటు ఇవ్వమని సదరు మహిళ కోరగా ముస్లిం మహిళా దుర్భాషాలాడి చంపుతానని ఆమెను బెదిరించిందని ఆరోపించారు. ఈ క్రమంలో బాధితురాలి భర్త ఎస్ఐని ఫోన్ చేసి పిలిపించుకుంది. జరిగిన విషయాన్ని ఆమె భర్తకు వివరించింది. అక్కడికి చేరుకున్న ఎస్ఐ ఎందుకు బెదిరించావని ముస్లిం మహిళను ప్రశ్నిస్తున్నక్రమంలో ఆమె వీడియో తీస్తుంటే ఆమె నుంచి ఎస్ఐ మొబైల్ తీసుకున్నందునా అతన్ని సస్పెండ్ చేయించడం ఎంతవరకూ సమంజసం అని బిసి సంఘం నాయకులు ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు.

◆ బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా విజేందర్

పటాన్‌చెరు టౌన్: పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా విజేందర్‌ను నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనను ఈ పదవికి నియమించిన డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ ఉపాధ్యక్షుడు ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

◆ బెస్ట్ నర్స్ అవార్డు అందజేత

జోగిపేట(అందోల్): అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా అందోల్ మండలం డాకూర్ గ్రామానికి చెందిన జి. సుశీలకు బెస్ట్ నర్స్ అవార్డు అందజేశారు. తెలంగాణ ఫ్లోరెన్స్ నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు శాలువా కప్పి సన్మానించారు.

◆ కొనుగోలు కేంద్రాల తనిఖీ

జోగిపేట(అందోల్): మండల పరిధిలోని అన్నాసాగర్, రాంసాన్‌పల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను తహసీల్దారు వెంకటేశం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్ల రికార్డులను పరిశీలించారు. ఐకేపీ ఏపీఎం మాణిక్యం, మండల వ్యవసాయాధికారి విజయరత్న, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి నర్సింలు పాల్గొన్నారు.

◆ జేపీఎస్‌లను వెంటనే క్రమబద్ధీకరించాలి

నారాయణఖేడ్: జేపీఎస్‌ల ఉద్యోగాలను వెంటనే క్రమబద్ధీకరించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బోర్గి సంజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట డివిజన్ పరిధిలోని జేపీఎస్‌లు చేపట్టిన నిరవధిక సమ్మెలో మాట్లాడారు.

◆ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసిన టీఎన్జీఓ అధ్యక్షుడు

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను శుక్రవారం సంగారెడ్డి జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎన్జీఓ భవన శంకుస్థాపనకు ఆహ్వానించినట్టు చెప్పారు.

◆ క్రీడాభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు అదర్శ్ రెడ్డి అన్నారు. శుక్రవారం భారతినగర్ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో స్థానిక యువత, మహిళా సంఘాలు, సీనియర్ సిటిజన్‌లకు క్రీడా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదర్శ్ రెడ్డి, నరసింహ, సత్యనారయణలు పాల్గొన్నారు.

◆ కంటి వెలుగు ప్రారంభం

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో కంటి వెలుగును కౌన్సిలర్ చందర్ నాయక్ శుక్రవారం ప్రారంభించారు.

పంచాయతీ కార్యదర్శికి నివాళి



పంచాయతీ కార్యదర్శి సోనికి నివాళి

సంగారెడ్డి టౌన్: ఆత్మహత్య చేసుకున్న వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం రంగాపూర్‌కు చెందిన గ్రామపంచాయతీ కార్యదర్శి సోనీకి శుక్రవారం సంగారెడ్డిలో పంచాయతీ కార్యదర్శులు ఘనంగా నివాళులర్పించారు. అమరవీరుల స్తూపం వరకు ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ప్రభుత్వం తమ ఉద్యోగులను విధుల్లో చేరాలంటూ ఒత్తిడికి గురి చేయడం బాధాకరమన్నారు. దీంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు.